www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 అక్టోబర్ 2023
5
ఏలూరు

జెడిపి సిఇఒగా సుబ్బారావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జెడిపి సిఇఒగా కె.ఎస్.ఎన్.సుబ్బారావు నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌చార్జి సిఇఒగా, డిప్యూటీ సిఇఒగా విధులు నిర్వహించిన రవికుమార్‌ను పంచాయతీరాజ్ కమిషనర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. గుడివాడ డివిఎల్‌డిఒగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జెడిపి డిప్యూటీ సిఇఒగా పెదపాడు ఎంపిడిఒ నిర్మలజ్యోతిని ఇప్పటికే ప్రభుత్వం నియమించింది. తొలుత జెడిపి సిఇఒగా కాకినాడ ఆర్‌డిఒ కె.వి.వి.సత్యనారాయణను నియమిస్తూ జిఒ విడుదల చేశారు. కానీ ఆ జిఒను సవరించి మరో జిఒ విడుదల చేసి సుబ్బారావును సిఇఒగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

ప్రేక్షకులకు సినిమా కష్టాలు

- ఆన్‌లైన్‌లో టిక్కెట్లు ఇవ్వకుండా బ్లాక్‌లో అమ్మకాలు
- అధిక ధరలకు తినుబండారాల విక్రయాలు
- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం
- సౌకర్యాల లేమితో ప్రేక్షకుల అవస్థలు
- కొరవడిన అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సినిమా థియేటర్లకు వెళ్తున్న ప్రేక్షకులకు యాజమాన్యాలు సరికొత్త 'బొమ్మ' చూపిస్తున్నాయి. ఓ పక్క ప్రేక్షకుల జేబు గుల్లవుతున్నా వినోదం సంగతి పక్కనపెడితే సినిమా కష్టాలు పడుతున్నారు. ఎడాపెడా ప్రేక్షకుడి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు అందుకు తగిన సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో థియేటర్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ఎంత పెద్దహీరో సినిమా రిలేజ్ అయినా పది, 15 రోజుల్లోనే రద్దీ తగ్గిపోతుంది. దీంతో సినిమాలను అత్యధిక స్క్రీన్లపై ఒకేసారి రిలీజ్ చేసి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి ఉంది. కొత్త సినిమాలకు టిక్కెట్ల ధరలను పెంపుచేసి అమ్ముకునేందుకు అవకాశం సైతం ఇస్తోంది. ఇది చాలదన్నట్లు బ్లాక్‌లో సైతం టిక్కెట్ల విక్రయాలు సాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, జంగారెడ్డిగూడెం ఇలా అనేక పట్టణాల్లో పెద్దఎత్తున సినిమా థియేటర్లు ఉన్నాయి. దాదాపు వందకుపైగా స్క్రీన్‌లు ఉన్నాయి. ఒక్క ఏలూరులోని సినిమా హాళ్లలో 11 స్క్రీన్లపై సినిమాలు ప్రదర్శిస్తున్నారు. ఆన్‌లైన్ టిక్కెట్ ధర రూ.150 ఉన్నప్పటికీ సినిమా రిలేజ్ సమయంలో అందుకు విరుద్ధంగా ధరలు పెంచుతున్నారు. కొంతమేర టిక్కెట్ పెంపునకు ప్రభుత్వం అవకాశం ఇస్తుండటంతో ఇదే అదునుగా మరింత దారుణంగా టిక్కెట్ ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్ టిక్కెట్లు ముందుగానే అయిపోయినట్లుగా బ్లాక్ చేసి సినిమా థియేటర్ వద్ద రూ.150 టిక్కెట్‌ను రూ.200 నుంచి రూ.250 వరకూ బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. పోలీసులుగానీ, రెవెన్యూ అధికారులుగానీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక సినిమా థియేటర్లలో తినుబండారాలు ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఎక్కడా అలాంటి పరిస్థితి లేదని చెప్పొచ్చు. పాప్‌కార్న్ కొనాలన్న అదిరిపడే పరిస్థితి నెలకొంది. రూ.20 ఖరీదు చేసే వాటర్‌బాటిల్ ఒక్కో థియేటర్‌లో రూ.30, మరికొన్ని థియేటర్లలో అంతకు మించి విక్రయిస్తున్నారు. సమోస సైతం రూ.పదికి విక్రయిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అదేమని అడిగిన ప్రేక్షకులపైకి వ్యాపారులు గొడవలకు దిగుతున్నారు. పెద్దఎత్తున సొమ్ములు వసూలు చేస్తున్న థియేటర్ యాజామాన్యాలు మరుగుదొడ్ల నిర్వహణ సైతం సరిగా నిర్వహించడం లేదు. టాయిలెట్‌కు వెళ్లాలంటనే భయపడే పరిస్థితులున్నాయి. ముఖ్యంగా మహిళలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం థియేటర్లలో వాహనాల పార్కింగ్‌కు డబ్బులు వసూలు చేయకూడదు. కానీ మోటార్‌సైకిల్‌కు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా సినిమా థియేటర్లలో నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు కొనసాగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

అధికారుల తనిఖీలు శూన్యం..

సినిమా థియేటర్లలో నిబంధనల అమలుపై అధికారుల తనిఖీలు అనేవి లేకుండా పోయాయి. యాజమాన్యాలు, అధికారులు కుమ్మక్కై వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వివిపిస్తున్నాయి. థియేటర్లలో విక్రయించే తినుబండరాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలే లేవంటే అతిశయోక్తికాదు. అదేవిధంగా టిక్కెట్ల విక్రయాలు, మరుగుదొడ్ల నిర్వహణ, తినుబండారాలకు సంబంధించి ఎంఆర్‌పి అమలు వంటివాటిపైనే అధికారులు తనిఖీలు లేకుండా పోయాయి. దీంతో థియేటర్ యామాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి తయారైంది. ప్రేక్షకుడిని నిలువెల్లా దోచేస్తునప్పటికీ సినిమా థియేటర్లపై చర్యలు తీసుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

4.83 లక్షల ఎకరాల్లో పంట నమోదు పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 4,83,899 ఎకరాల్లో పంటల సాగు, ఇ-క్రాప్ నమోదు పూర్తిచేశామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.రామకృష్ణ తెలిపారు. దీనిలో వరి 1,99,508 ఎకరాల్లో సాగు ఉందన్నారు. జిల్లాలో ఖరీఫ్ 2023కు గాను వరి, మినుము పంటలకు వైఎస్ఆర్ దిగుబడి ఆధారిత ఉచిత పంటల బీమా పథకం, పిఎంఎఫ్‌బివై ద్వారా బీమా కల్పించడం జరుగుతుందని, నిబంధనల మేరకు పంటల బీమా కల్పిస్తామని తెలిపారు. అదే విధంగా రైతులకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే పూర్తిగా చెల్లించిందన్నారు. ఈ పంటల బీమా సంస్థగా ప్రభుత్వంతో పాటుగా ఓరియంటల్ జనరల్ బీమా కంపెనీ ద్వారా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సంస్థ పంటల బీమాకు సంబంధించిన క్లెయిమ్ చెల్లిస్తుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో నమోదు చేయించి ఇకెవైసి కూడా పూర్తి చేసి ఉండాలన్నారు. అదే విధంగా ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీకి ప్రదర్శించబడుతుందని, గ్రామసభలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా ఇప్పటి వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టం జరిగిన రైతు వివరాలు సేకరించి, పంటల బీమా నిబంధనలకు అనుగుణంగా బీమా చెల్లిస్తారని తెలిపారు. అదే విధంగా వాతావరణ ఆధారిత పంటల బీమాను జిల్లాలో ఖరీఫ్ 2023కు గాను, ప్రత్తి పంటకు వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో యూనివర్సల్ సాంపో కంపెనీ ద్వారా క్లెయిమ్ చెల్లింపులు నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని తెలిపారు.

12 గ్రామాల్లో 5956 ఓపి నమోదు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గురువారం 12 గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 5,956 ఓపి నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. వీరిలో మహిళలు 3217 మంది, పురుషులు 2,739 మంది ఉన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 121 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు. వివిధ అనారోగ్య సమస్యలున్న 5953 మందికి ఉచితంగా మందులు అందించామన్నారు. కంటి వెలుగు శిబిరంలో 856 ఓపి నమోదైందన్నారు.

నేడు కలిదిండిలో 'జగనన్నకు చెబుదాం' గ్రీవెన్స్

ప్రజాశక్తి - కలిదిండి

ప్రతీ బుధవారం, శుక్రవారం మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ డే నిర్వహణలో భాగంగా కలిదిండిలో ఈ నెల 27వ తేదీన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలిదిండి (భీమవరం రోడ్డు లోని) కల్యాణి ఫంక్షన్ హాలులో ఉదయం పది గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కలిదిండి మండల ప్రజలు తమ సమస్యలను ఈ కార్యక్రమంలో తెలియజేయవచ్చన్నారు. జిల్లాఅధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

28న 'జగనన్న వాగ్దాన భంగం'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జగనన్న వాగ్దాన భంగంను నిరసిస్తూ ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కార్మికులు మున్సిపల్ ఆఫీసుల వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆ పిలుపులో భాగంగా ఏలూరు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడులో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు జగనన్న వాగ్దాన భంగంపై నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ తెలిపింది. స్థానిక నరసింహారావుపేటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం బాలరాజు అధ్యక్షతన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఆ వివరాలను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు పత్రికలకు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు వైఎస్.జగన్ ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలోనూ, పాదయాత్రలోనూ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌కు పెద్ద తేడా లేదని చంద్రబాబు ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా మోసం చేసిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు మాసాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నమ్మి లక్షలాది ఉద్యోగులు, వారి కుటుంబాలు జగనన్నకు ఓట్లేసి ముఖ్యమంత్రిని చేశారని, కానీ దానికి భిన్నంగా వ్యవహరించారన్నారు. ఎన్నికలు జరిగి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా రాష్ట్రంలో ఉన్న మూడు లక్షల 50వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయలేదని ఆయన విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రమే పర్మినెంట్ చేస్తూ జిఒ 114ను విడుదల చేశారని ఆయన తెలిపారు. 20, 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న మూడు లక్షల 40 వేల మంది ఉద్యోగుల పర్మినెంట్ సంగతి ఏమిటని ఆయన ప్రశ్నించారు. 11వ పిఆర్‌సి ప్రకారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాల్సి ఉండగా సిఎం జగన్ ప్రభుత్వం రూ.15 వేలు మాత్రమే నిర్ణయించిందని ఆయన తెలిపారు. పిఆర్‌సి అమలు విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తీరనిఅన్యాయం చేసిందని విమర్శించారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న అన్ని విభాగాలకు చెందిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు జగనన్న వాగ్దాన భంగంపై నిరసన ప్రదర్శన-సభల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ జిల్లా కమిటీ సమావేశంలో లావేటి కృష్ణారావు, బంగారు వెంకటేశ్వరరావు, తానంకి జార్జి, విజయరాజు, నాగరాజు, స్వాతి, ప్రవీణ్, రాజు, వినోద్ పాల్గొన్నారు.

వర్షాభావంతో పంట కోల్పోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ఎండిన వరి దుబ్బులతో జిల్లాలో రైతులు ఆందోళన

ప్రజాశక్తి - ముసునూరు

వర్షాభావంతో సాగునీరందక వరి పంట ఎండిపోయి నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గురువారం ముసునూరు మండలం గుడిపాడులో సాగునీరందక ఎండిపోయిన వరి పంటలను సిపిఎం, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఎండిన వరి దుబ్బులతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. నష్ట పరిహారమిచ్చి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ వర్షాభావం వల్ల గుడిపాడు పంచాయతీ రావికుంట చెరువులో నీరులేక సుమారు 50 ఎకరాల వరకూ సాగునీరందక వరి పంట ఎండిపోయి, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు సుమారు రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టారని చెప్పారు. పంట పొట్టదశకు చేరుకున్న తర్వాత నీరందక పంట ఎండిపోయిందన్నారు. జలకళ పథకంలో పేద రైతులకు బోర్లు వేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రభుత్వం స్పందించి పేద రైతులకు ఉచిత బోరు పథకం అమలు చేయాలన్నారు. పంట నష్టాన్ని వెంటనే నమోదు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కష్టపడి సాగు చేసిన వరి పంట ఎండిపోవడంతో రైతుకంట కన్నీళ్లు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ఉపాధి కోల్పోయిన రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు పామర్తి మధు, బాధితరైతులు సిహెచ్.వెంకట రత్నం, సిహెచ్.శివయ్య, కె.శ్రీరాములు, పి.రంగారావు, దాసరి శ్రీను, బి.జయమ్మ, రైతులు పాల్గొన్నారు.



కుక్కునూరు మండలంలో..

ముసునూరు మండలంలో..

జీలుగుమిల్లి : వర్షాభావంతో సాగునీరందక వరి పంట ఎండిపోయి నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలో సాగునీరు అందక ఎండిపోయే స్థితికి వచ్చిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావం వల్ల సాగునీరందక వరి పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వరిపంట పొట్ట దశకు చేరుకున్న తర్వాత నీరందక పంట ఎండిపోయే పరిస్థితికి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పేద రైతులకు ఉచిత బోరు పథకం అమలు చేయాలన్నారు. పంట నష్టాన్ని వెంటనే నమోదు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు జానకిరామిరెడ్డి, సిహెచ్.కొండలరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి మండలంలో..

కుక్కునూరు: వర్షాల్లేక ఎండిపోయిన పత్తి, మిర్చి పంట రైతులను ప్రభుత్వం ఆదుకుని రూ.50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, రైతు రుణమాఫీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో మాధవరంలో వర్షాల్లేక ఎండిపోయిన మిర్చి, పత్తి పంటలను పరిశీలించి, ఎండిన మిర్చి, పత్తి దుబ్బులతో రైతులతో నిరసన తెలిపారు. నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ వర్షాభావం వల్ల నీరు లేక మాధవరం పంచాయతీ పరిధిలో 50 ఎకరాలకుపైగా సాగునీరందక వరి, మిర్చి, పత్తి పంట ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో వేలాది ఎకరాల్లో పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయని, మరోపక్క బ్యాంకులో అప్పుతీసుకుని ఎకరాకు రూ.25 వేలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టారన్నారు. పంట పొట్ట, కాపు దశకు చేరుకున్న తర్వాత నీరందక పంట ఎండిపోతుందని, జలకళ పథకంలో పేద రైతులకు బోర్లు వేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రభుత్వం స్పందించి పేద రైతులకు ఉచిత బోరు పథకం అమలు చేయాలన్నారు. కష్టపడి సాగు చేసిన పంట ఎండిపోవడంతో రైతుల కంట కన్నీళ్లు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటల బీమాను వర్తింపజేయాలన్నారు. ఉపాధి కోల్పోయిన రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. రైతుల బ్యాంకు రుణాలు మాఫీ చేసి, నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ మహబూబ్ పాషా, యర్రం సాయికిరణ్, మేడిపల్లి బాబు, కోట మోహన్ రావు, దేవరాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒగా అద్దయ్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



అద్దయ్య

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒగా కె.అద్దయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలనాడు జిల్లా గురజాల ఆర్‌డిఒగా పనిచేస్తూ బదిలీపై జంగారెడ్డిగూడెం వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకు జంగారెడ్డిగూడెంలో పనిచేసిన ఆర్‌డిఒ జాన్సీరాణి కొవ్వూరు ఎస్‌డిసిగా బదిలీపై వెళ్లారు.

తాడిపూడి కాలువ గట్టుపై అక్రమ తవ్వకాలు

జెసిబిని పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జెసిబిని స్వాధీనం చేసుకున్న అధికారులు

తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ గట్టున గ్రావెల్, మట్టి తవ్వుతుండగా ఉంగుటూరు రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి దాడి చేసి ఒక జెసిబిని స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించిన వివరాలను అధికారులు గురువారం రాత్రి విలేకర్లకు వివరించారు. తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం కడియద్దకు చెందిన చీకుర్తి బసవయ్య అక్రమంగా తవ్వేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిరిగినీడి సత్యనారాయణ, విఆర్‌ఒ కంభంపాటి నాగ పెద్దిరాజు స్థానిక పోలీసుల సాయంతో పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న జెసిపిని ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉంచారు.

రైతులను ఆదుకోవడంలో వైసిపి విఫలం : టిడిపి

ఎండిన వరి పొలాలను పరిశీలించిన పార్టీ నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



వరి చేలను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు విమర్శించారు. గురువారం మండలంలోని శ్రీనివాసపురం, అక్కంపేట తదితర ప్రాంతాల్లో టిడిపి రైతు అధ్యక్షులు ఎలికే ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి నేతలు వర్షాలు లేక ఎండిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దాసరి శేషు, టిడిపి మండల అధ్యక్షుడు సాయల సత్యనారాయణ మాట్లాడుతూ జగన్ సిఎం పదవి చేపట్టిన నాటి నుంచి విపత్తులు రాష్ట్ర ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్నాయని విమర్శించారు. కరోనా, కళ్ల కలకలు వ్యాధి, జ్వరాలు, వర్షాలు లేక కరువు పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమం రైతులను ఆదుకోవడంపై దృష్టి పెట్టకుండా రాజకీయ కక్ష సాధింపులకు సిఎం జగన్ ఎక్కువ సమయం కేటాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబొయిన రామలింగేశ్వరరావు, యువనాయకులు అన్నపురెడ్డి గంగాధర్, తడికల మోహన్, రాగాని శ్రీను, పులపాకుల ప్రసాద్ పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే భూ సంస్కరణల చట్టం : సిపిఐ

భూములు పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సిపిఐ సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే భూసంస్కరణ చట్టం ఏర్పడిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని అల్లంచర్లరాజుపాలెం అటవీ బంజరు భూములను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పాలకులు భూసంస్కరణ చట్టాన్ని తమ చుట్టంగా వాడుకుంటున్నారని విమర్శించారు. భూ సంస్కరణ చట్టం ప్రకారం మిగులు భూములను పేదలకు పంచాల్సింది పోయి భూస్వాములు బినామీ పేర్లతో లక్షలాది ఎకరాలు భూములు దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. అల్లంచర్లరాజుపాలెం ఏరియాలో రూ.మూడు వేల ఎకరాలకు పైగా ఉన్న అటవీబంజరు భూమిని సమగ్రంగా పరిశీలించి ఇందులో సగభాగం రెవెన్యూకు చెందిన భూమిగా తమ వద్ద సమాచారం ఉందని ఆయన తెలిపారు. రెవెన్యూ భూమిని భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఒక హెక్టార్ చొప్పున పంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు కుంచే వసంతరావులు, సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమి బాల యేసు, కామవరపుకోట మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జి.సత్యనారాయణ, టి.నరసాపురం మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తాడిగడప జయరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్లమోతుల శ్రీనివాసరావు, బాలాజీ, గదుల సత్యనారాయణ, సిపిఐ నాయకులు మీనుగుల దుర్గారావు, బాలిన రమణరావు, వీరంకి వెంకట్రావు పాల్గొన్నారు.

వర్షాభావంతో ఎండిపోతున్న పత్తి..!

ఆవేదన వ్యక్తం చేస్తున్న కౌలు రైతు నరసింహారావు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పర్వతాపురంలో సరైన వర్షాలు లేక ఎండిపోతున్న పత్తి పైరు తీవ్రమైన ఎండలతో వరి పంట ఎండిపోతున్న తరుణంలో మెరక పైరు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పర్వతాపురం గ్రామంలో కౌలు రైతు సప్పరపు నరసింహారావు ఆరు ఎకరాల మెరక భూమిని కౌలుకు తీసుకుని పత్తి పైరు సాగు చేస్తూ ఉండగా పత్తి పూత పిందె దశలో వర్షాలు పడక పత్తిపైరు వాడబడి ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 30 వేల వరకు నష్టం వాటిల్లుతుందని, పెట్టుబడులు, భూ యజమానికి ఇవ్వాల్సిన డబ్బులతో కలిపి ఆరు ఎకరాలకు రూ.1.80 లక్షల నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వం ఆదుకోవాలని లేకపోతే కౌలురైతులకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

'సంకల్ప' స్కూల్లో సాగర్‌కు సీటు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సంకల్ప సీనియర్ సెకండరీ స్కూల్లో పొంగుటూరుకు చెందిన విద్యార్థి బల్లి సాగర్ సీటు సాధించినట్లు పెద్ద తాడేపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. పొంగుటూరు గ్రామానికి చెందిన పెద్ద వెలగయ్య కుమారుడు బల్లి సాగర్ ఎనిమిదో తరగతి అభ్యసిస్తున్నట్లు తెలిపారు. బరంపురంలో ఇకపై సాగర విద్య అభ్యసిస్తాడని తెలిపారు.

రమణక్కపేట జిల్లా పరిషత్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు రమణక్కపేట విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 28, 29, 30 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నిర్వహించే అండర్-బి19 రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక కావడం ఆనందదాయకమని ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకష్ణ అన్నారు. మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు సిహెచ్.కీర్తన, ఎం.తేజశ్రీ, ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


బంగారు మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

టిడిపి నేత బంగారు మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు కంచు బంగారు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచిస్తున్న అధికారులు

ఇ- క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి వ్యవసాయ రైతు ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపిపి కోటగిరి రాజానాయన సూచించారు. మండలంలోని లోపుడి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అవగాహన గ్రామసభ లోపూడి సర్పంచి పేరం కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగిరి రాజానాయన మాట్లాడుతూ ప్రతి రైతు తాము పండిస్తున్న పంట, ఆ రైతు వివరాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న లబ్ధిని పొందాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. నష్ట పరిహారం, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలు పొందటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యోగులు, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

అన్నదానంలో యాత్రికులు

మద్ది ఆలయానికి యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి యాత్రికుల రద్దీ పెరిగిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. గురువారం పరిసర ప్రాంతాల నుంచి మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఈ క్రమంలో సుమారు 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారిగా భాధ్యతలు చేపట్టిన మద్ది ఆలయాన్ని సందర్శించాలని తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు రంగారావు ఆలయ మర్యాదలతో ఆర్‌డిఒ అద్దయ్యకు స్వాగతం పలికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించినట్లు తెలిపారు. శనివారం ఆలయం మూసివేత ఈ నెల 28వ తేదీ చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని మూసివేసి, తిరిగి ఆదివారం ఉదయం 8.00 నుంచి తెరుస్తారని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద గురువారం ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్ర ప్రాంతానికి అనుమానాస్పదంగా బ్యాగ్‌తో వస్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా బ్యాగ్‌లో ఐదు లీటర్ల నాటు సారా గుర్తించినట్లు తెలిపారు. నాటు సారాయిని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్యాభివృద్ధికి సుధామ ఫౌండేషన్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - మండవల్లి



విద్యార్థికి నగదు అందిస్తున్న ఎల్ఎస్.భాస్కరరావు

విద్యలో మరింత రాణించే విధంగా సుధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. శ్రీకాకుళంలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో ఫ్రీ సీటు పొంది మొదటి సంవత్సరం చదువుతున్న మకరం లక్ష్మీనాగసురేంద్ర నాయుడు విద్యలో మరింత ప్రోత్సహించే విధంగా సుధామ ఫౌండేషన్ అధినేత సుధా బత్తుల విజయకుమార్ అందించిన రూ.పదివేలు శుభం ఫంక్షన్ హాలులో ఆయన చేతులమీదుగా విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్తు పట్ల సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి విజయకుమార్ అన్నారు. శాస్త్రవేత్త అయినప్పటికీ సామాజిక పర్యావరణం సైన్స్‌పై అవగాహన కలిగించటంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం మరింత ఆనందదాయకమన్నారు. అంతేకాకుండా సుధామ ఫౌండేషన్ స్థాపించి రైల్వే స్టేషన్ పలు ప్రభుత్వ కార్యాలయం వద్ద ఆయన సొంత నిధులతో ఔషధ మొక్కలను నాటి గార్డులను అమర్చి సంరక్షిస్తున్నారన్నారు. పాఠశాలలో, కళాశాలలో సైన్స్ పైన సామాజిక విషయాలపైన సెమినార్లు నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాజ సేవ అనేది ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రొఫెసర్ కావడానికి దేశం ఎంతో ఇచ్చిందని రుణం తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నానని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యచరణ రూపొందించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్యం పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు టి.అప్పారావు, ఎస్,సిద్ధార్థ, ఎం.అజిత్, సుధామ ఫౌండేషన్ ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

10,501 మంది రైతులకు ఇ కెవైసి పూర్తి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో 10501 మంది రైతులకు ఇకెవైసి పూర్తి చేసినట్లు మండల వ్యవసాయాధికారి బాలిన వెంకటేష్ వెల్లడించారు. వరి 23,470, మినుము 571, చెరకు 191, వేరుశెనగ 24, ఉద్యానవన పంటలు 5095 మొత్తం 29,357 ఎకరాలకు 29,862 ఎకరాల్లో 10,501 మంది రైతులకు ఇకెవైసి చేసి ముసాయిదా జాబితాలు మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 26, 27, 28 తేదీల్లో సోషల్ ఆడిట్ నిమిత్తం ప్రదర్శించామని, రైతు వాటిని పరిశీలించుకోవాలని కోరారు. ఆ జాబితాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక వ్యవసాయ సిబ్బందికి తెలియచేస్తే వాటిని సవరించేందుకు అవకాశముందన్నారు. ఉంగుటూరు ఆర్‌బికెలో జాబితా ప్రదర్శనలో సర్పంచి బండారు సింధు, పంచాయతీ కార్యదర్శి జివి.గిరిధర్, రైతులు పాల్గొన్నారు.

ఇ క్రాపింగ్ నమోదుపై జాబితాలు సోషల్ ఆడిట్ నిమిత్తం అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ తెలిపారు. ఉంగుటూరు రైతు భరోసా కేంద్రంలో జాబితాలను గురువారం ప్రదర్శించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని చెప్పారు. సర్పంచి బండారు సింధు, రైతు భరోసా కేంద్రం కన్వీనర్, రైతులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో...

జంగారెడ్డిగూడెం :రైతు భరోసా కేంద్రాల్లో ఇ పంట నమోదు సమస్యను పరిష్కరించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కెవిఎన్.పోసారావు తెలిపారు. మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాల్లో ఇ పంట నమోదు ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి పోసారావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించిన ఇ పంట నమోదు జాబితాలో సమస్యలు ఉంటే ఈ నెల 30వ తేదీ లోపు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ పంట నమోదులో రైతుల పేర్లు పంట విస్తీర్ణం సంబంధిత వివరాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఈ పంట నమోదు చేసుకొని రైతులు వెంటనే దగ్గరలోని రైతు భరోసా కేంద్రాల్లో తాము సాగు చేసే పంట వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి : 2023 ఖరీఫ్ ఇ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయిందని, బుకింగ్ డేటాను ఆర్‌బికెలో ఆడిట్ కోసం పొందుపరిచినట్లు ఎఒ మీనాకుమారి తెలిపారు. రైతులు అభ్యంతరాలు ఉంటే ఆర్‌బికెలో తెలియజేయాలని కోరారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మహిళల జట్టు

దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న 71 వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మహిళా విభాగంలో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. బుధవారం అర్ధరాత్రి నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు విశాఖపట్నం జట్టుపై 32-21 స్కోరుతో విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ఆద్యాంతం ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో కృష్ణా జట్టు విజేతగా నిలిచింది. బుధవారం తెల్లవారుజామున ఫైనల్ మ్యాచ్ కృష్ణా విజయనగరం జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. మ్యాచ్ ముగిసే సరికి ఇరుజట్లు 22-22 స్కోరుతో సమంగా నిలిచాయి. దీంతో ఇరుజట్లకు ఐదు రైడ్స్ అవకాశం ఇవ్వగా కృష్ణాజిల్లా జట్టు 6-4 తేడాతో విజయం సాధించింది. విజేతలకు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు విజేతలకు బహుమతులు అందించారు.


పురుషుల జట్టు

'గడపగడపకూ' అర్జీలు సత్వరం పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ఆళ్ల నాని అధికారులను ఆదేశించారు. 38, 34 డివిజన్‌లలోని సచివాలయాల పరిధిలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆయన గురువారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. అర్హత కలిగి ఉండి కూడా పథకాలు అందని వారికి సంబంధిత సాంకేతిక సమస్యలను సరిచేసి పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యర్రంశెట్టి సుమన్, తోట శివ, తోట అప్పారావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్.పెదబాబు, డిప్యూటీ మేయర్లు ఎన్.సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, కమిషనర్ వెంకటకృష్ణ, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - ఉండి

భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) పోరాటాల ఫలితంగానే మహిళా హక్కులు, చట్టాలు సాధించామని సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. గురువారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన మహిళా సమాఖ్య జిల్లా 15వ మహాసభలో దుర్గాభవాని ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మహాసభకు నెక్కంటి జగదాంబ, దేవి, యర్రంశెట్టి శాంతామణి అధ్యక్షత వహించారు. దుర్గాభవాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా మహిళా చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మహిళా సమాఖ్య దేశవ్యాప్తంగా పోరాటాలు సాగించిందన్నారు. చట్టాన్ని ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లు 2029 తర్వాత అమల్లోకి వస్తాయనడం మహిళలను వంచించడమేనన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం, సాధికారతే తమ లక్ష్యమని చెపుతున్న ప్రభుత్వాలు ఆచరణలో మహిళలకు మొండి చేయి చూపుతున్నారన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, నల్లధనం వెలికితీసి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పి నేడు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు మాట్లాడారు. తొలుత మహిళా సమాఖ్య పతాకాన్ని సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.దేవి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, తిరుమాని కామేశ్వరరావు, సిపిఐ నాయకులు సనపల శ్రీనివాస్, మండల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్ఐ చంటిబాబు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉన్నతాధికారుల ఆదేశానుసారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ-సామాజిక పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీలను ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు పరిశీలించారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన వారికి, రూ.ఐదు వేలు, ద్వితీయ బహుమతి పొందిన వారికి రూ.మూడు వేలు, తృతీయ బహుమతి పొందిన వారికి రూ.రెండు వేలు అందించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఎంఎస్‌కె.క్రీస్తురాణి పాల్గొన్నారు.

జూడో పోటీల్లో గొల్లపల్లి, పల్లేర్లమూడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

బహుమతులు అందుకున్న విద్యార్థులు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో, పల్లేర్లమూడి విద్యార్థులు జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆ విద్యార్థులకు గొల్లపల్లి క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రాంబాబు బహుమతులు అందించారు. క్రీడాకారులు మేఘన, శ్రీజ, దేవిశ్రీ, ఉమామహేశ్వరి, ఇందు, ప్రశాంతి, ధనుశ్రీ, సమీర, జ్యోత్స్న, వాసవి, శరణ్య, కిరణ్, రాఘవ, రాజేష్, విజయకుమార్, నిఖిల్, భానుప్రసాద్, ఉగ్ర, జగదీష్, నాగరాజు, శ్రావణి, మణికంఠ, రాజేశ్వరి, రామచైతన్య, గాల్షిద్, హేమంత్, పల్లవి, పవిత్ర, ఉమశ్రీలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాధికారాణి, ఉపాధ్యాయులు పి.రవీంద్ర, లక్ష్మి, మనోహరం, మోహన్‌రావు, సాకా రవి, రంగారావు, విఠల్‌బాబు, బాలు, మల్లేశ్వరి, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, నాన్ టీచింగ్ సిబ్బంది రవి, నారాయణ, ధనలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

వర్షాభావంతో 550 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో 550 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు వ్యవసాయ శాఖ ఎడిఎ జి.విద్యాసాగర్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత రైతులకు నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని చెప్పారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితి ఉండటంతో చాట్రాయిలో 500 ఎకరాలు, ముసునూరులో 50 ఎకరాలు పంట ఎండిపోయిందని ఎడిఎ తెలిపారు. నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు.

ఆర్‌టిసి కార్గో మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు పురస్కరించుకుని గురువారం ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద ప్రారంభోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌డిఒ ఎన్.షేక్ ఖాజావలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తుంటామని, అందులో భాగంగా ఈ నెల 26వ తేదీ నుంచి నవంబరు 25 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 84 ప్రదేశాల్లో పది కిలోమీటర్ల వరకు 50 కిలోల బరువు వరకు ఉచిత డోర్ డెలివరీ సౌకర్యాన్ని అందిస్తున్నామని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేవలం 24 గంటల లోపే మనం అనుకున్న ప్రదేశాలకు డోర్ డెలివరీ జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథి కాజావల్లి మాట్లాడుతూ ప్రజల్లో ఎంతో నమ్మకాన్ని సంపాదించుకున్న ఎపిఎస్ఆర్‌టిసి కార్గో తన సేవలను మరింత విస్తృతం చేస్తూ డోర్ డెలివరీ కూడా చేపట్టిందని, ప్రతి సంవత్సరం రూ.కోట్ల వ్యాపారం చేస్తూ ప్రజలకు ఎంతో నమ్మకంగా సేవలందిస్తోందని, ముఖ్యంగా ఈ డోర్ డెలివరీని అందరూ ప్రోత్సహించాలని, తాను కూడా చాలాసార్లు ఈ డోర్ డెలివరీ బుకింగ్ చేశానని, అనుకున్న సమయానికి అవి చేరాయని, ప్రతిఒక్కరూ ఎపిఎస్ఆర్‌టిసి డోర్ డెలివరీ కార్యక్రమాన్ని వినియోగించుకుని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, కార్గో కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు, ఎఎంటి. మురళి, పిఆర్ఒ కెవిఎల్‌వి నరసింహం, కార్గో సిబ్బంది, కార్మికులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

మెరకగూడెంలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రవ్వవారిగూడెం పంచాయతీ మెరకగూడెం గ్రామంలో యూనిట్ 25లో గురువారం నిర్వహించిన బాబుతో నేను కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, జగన్ రాజకీయ కక్షతో చేస్తున్న నీచ రాజకీయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సున్నం నాగేశ్వరరావు, కోర్స వెంకటేశ్వరరావు, మడకం దుర్గారావు, బడిశా ముత్యాలరావు, మడకం రామకృష్ణ, సోదేం శ్రీను, కుర్సం చిన్నరావు, తమా దుర్గారావు, కుర్సం సీతయ్య, కుర్సం రాజు, దేవయ్య పాల్గొన్నారు.

గుర్వాయిపాలెంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని గుర్వాయిపాలెం ఎంపియుపి పాఠశాల వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపి కూసంపూడి కనకదుర్గారాణి, సర్పంచి బత్తిన ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు గోదావరి సత్యనారాయణ, ఉప సర్పంచి నల్లూరి మహాలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు వడుపు రామారావు, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, వైద్యులు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : మండలంలోని కొండలరావుపాలెం గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచి పి.సత్యవతి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం డాక్టర్లు, మండల స్థాయి అధికారులను జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీప్రసాద్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ విజయబాబు, వైసిపి బిసి సెల్ అధ్యక్షులు గంటా ప్రసాదరావు, ఎంపిపి రమ్యకుమారి, మండల ప్రత్యేకాధికారి వివి.సత్యనారాయణ, ఎంపిడిఒ, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన ముఖ్య సలహాదారుగా చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కాపు సంక్షేమ సేన ఏలూరు జిల్లా ముఖ్య సలహాదారుగా మోటేపల్లి చంద్రశేఖర్ ఎంపికైనట్లు కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు చేగొండి హరిరామజోగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మోటేపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ కాపుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు. ఎంపికైన మోటేపల్లిని పలువురు అభినందించారు.

ధర్నా చేస్తున్న మహిళలు, సిపిఎం నాయకులు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

తాగునీరు ఇప్పించండి మహాప్రభో అంటూ ఖాళీ బిందెలతో మహిళలు గురువారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. చినపల్లివీధి, రజిత వీధి డైలీ మార్కెట్ సమీప ప్రాంతాల మహిళలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన తెలిపారు. నిరసనకు సిపిఎం, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి తొమ్మిదో వార్డు ఇన్‌ఛార్జి దుర్గారావు మాట్లాడుతూ సుమారు 15 రోజులుగా తాగునీరు రాక స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. పైప్‌లైన్ పాడైపోయి ఎన్నిసార్లు బాగు చేయాలని మొరపెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని తెలిపారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ గతంలో నీరు రానప్పుడు పంచాయతీ వారు ట్యాంకులతో తాగునీరు అందించేవారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. వెంటనే సర్పంచి పైప్‌లైన్ బాగు చేయించి, తాగునీరు పూర్తిస్థాయిలో అందించాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు టి.వెంకటరాము, టి.వెంకట అప్పారావు, తిరుమాని దుర్గ, విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, సిపిఎం నాయకులు బి.వర్మ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, వన్‌టౌన్‌కి చెందిన యర్రంశెట్టి విజయ అనంతలక్ష్మి సత్యవతి దేవి అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **X9997630** అను నా పాస్‌పోర్టు **ది.23-10-2023వ తేదీన మేము ఇల్లు మారుతుండగా పోయినది.** కావున దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకి తెలియజేయగలరు.

యర్రంశెట్టి విజయ అనంతలక్ష్మి సత్యవతి దేవి
వన్‌టౌన్, ఏలూరు, ఏలూరు జిల్లా.
సెల్: 98481 45579